క్లుప్తంగా

మద్యం బాటిళ్లు స్వాధీనం

కాశినాయన : మండలంలోని వరికుంట్ల గ్రామానికి చెందిన దబ్బనం రాజశేఖర్ అనే వ్యక్తి నుంచి మంగళవారం 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో గంజాయి, నాటుసారా, పేకాట ఆడిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళి

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో సీపీఎం జాతీయ ప్రధానకార్యదర్శి, కమ్యూనిస్టు మేధావి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి పట్ల సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్‌లు సీతారాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు సీపీఎం నాయకులు సీతారాం ఏచూరిని ఉద్దేశించి ప్రసంగించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

అట్లూరు : మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు జూడో, కుస్తీ క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఫణిశ్రీ, పీఈటీ ప్రమీల తెలిపారు. మంగళవారం కడపలోని వైఎస్సార్ క్రీడాపాఠశాలలో జరిగిన అండర్–19 జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో జూడో పోటీల్లో సునీత, అమృత, ఝాన్సీ, ప్రవళిక, శిరీష, అమృత, కుస్తీ పోటీల్లో చైతన్యలక్ష్మి, ఝాన్సీ, మస్తాన్‌బీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను ప్రిన్సిపాల్, పీఈఓ, ఉపాధ్యాయులు అభినందించారు.

నిరుద్యోగులకు వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ

మైదుకూరు : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్ ద్వారా వెబ్ డెవలపర్ కోర్సు శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు చూపుతామని ఆయన పేర్కొన్నారు. మైదుకూరు మండలంతోపాటు చుట్టుపక్కల ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు రిజిస్ట్రేషన్ కోసం 9398348760, 9701801902 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

మెడికల్ సీట్లు వద్దని లేఖ రాయడం దారుణం

ప్రొద్దుటూరు కల్చరల్ : పులివెందుల మెడికల్ కళాశాల మంజూరైన 50 సీట్లు వద్దని నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాయడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ పేర్కొన్నారు. సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు రాష్ట్రంలో ఉన్న మెడికల్ కళాశాల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లను రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి వంద రోజులైన చేయలేదన్నారు. పులివెందు కళాశాలకు మంజూరైన 50 సీట్లను ఎన్ఎంసీకి వద్దని లేఖ రాయడం దుర్మార్గమన్నారు. ఇది ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేట్‌పరం చేసేలా చర్యలు తీసుకోవడమే అన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సునీల్, శ్రవణ్, సప్తగిరి, ప్రసాద్, యోగేష్ పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన

మైదుకూరు : జమ్మలమడుగు, మైలవరం మండలాల్లో రైతులు సాగు చేసిన పత్తి పంటను వ్యవసాయ అధికారులతో కలసి మంగవారం పరిశీలించినట్లు మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ తెలిపారు. జమ్మలమడుగు, మైలవరం మండలాల్లో పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతంగా ఉన్నట్లు గమనించామని శాస్త్రవేత్త బాలకృష్ణ పేర్కొన్నారు. డీపీడీ పద్మలత, ఏడీఏ పి.సురేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏఓలు పి.పద్మజ, చంద్రశేఖర్‌రెడ్డిలతో పొన్నతోట, దొమ్మరనంద్యాల, వేపరాల, చిన్నకొమ్మెర్ల, పెద్దకొమ్మెర్ల గ్రామాల్లో పత్తిపంటలో గులాబీరంగు పురుగు తీవ్రతను గుర్తించినట్లు తెలిపారు. పంట ఆఖరి దశలో ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే సైపెరమెత్రిన్ 50 ఈసీ 1 గ్రామును లీటర్ నీటితో కలిపి పిచికారి చేయాలని రైతులకు చెప్పామని శాస్త్రవేత్త బాలకృష్ణ తెలిపారు.

ఓజోన్ పొర రక్షణకు కృషి చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ ఓజోన్ పొర పరిరక్షణకు కృషి చేయాలని కౌశల్ జిల్లా సమన్వయ కర్త కేవీ విజయమోహన్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తాళ్లమాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్‌కాస్ట్), పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొక్కలను ఎంత ఎక్కువగా పెంచితే అంత కాలుష్యం తగ్గుతుందన్నారు. ప్రకృతిలోని సమతుల్యతను కాపాడాలని, ఓజోన్‌పొరను నాశనం చేసే పదార్థాల గురించి విద్యార్థులకు వివరించారు. జిల్లా సైన్స్ సమన్వయకర్త డీవీ సుబ్బానాయుడు మాట్లాడుతూ ఓజోన్ సహజంగా విషవాయువు అయిన అతి నీలలోహిత కిరణాలను జీవరాశిపై పడకుండా కాపాడుతుందన్నారు.

పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరం



కూటమి ప్రభుత్వం ఈ ఏడాది అందుబాటులోకి రాబోతున్న ఐదు మెడికల్ కాలేజీలను వద్దనుకోవటం కూటమి సర్కారుకు సిగ్గుచేటు. కాలేజీల్లో వసతులు కల్పించలేమని, నిర్వహించటం సాధ్యపడదని, అదనపు సీట్లు అవసరం లేదని మెడికల్ బోర్డుకు లేఖ రాయటం హేయం. ప్రభుత్వ రంగంలో అదనపు సీట్లు వస్తుంటే ఏ రాష్ట్రమైనా వద్దకుంటుందా, కొత్తగా 750 సీట్లు సమకూరకపోవటం చంద్రబాబు నిర్లక్ష్య ఫలితమే. మెడికల్ సీట్ల కోసం పక్క రాష్ట్రాల బాటపట్టేలా చేశారు. ఇప్పటికైనా కొత్త మెడికల్ కాలేజీల్లో వసతులు కల్పించి ఈ ఏడాది నుంచే వాటిని ప్రారంభించాలి.

– చాపాటి రామసుధాకర్‌రెడ్డి, ప్రోగ్రెసివ్ ఫౌండేషన్ చైర్మన్, చాపాడు



ఎన్ఎంసీకి లేఖ రాయడం దుర్మార్గం



పులివెందుల మెడికల్ కళాశాలకే కేటాయించిన 50 మెడికల్ సీట్లను నిర్వహించలేమని సీఎం చంద్రబాబు నాయుడు ఎన్ఎంసీకి లేఖ రాయడం దుర్మార్గం. పులివెందుల మెడికల్ కాలేజీ ప్రైవేటు వ్యక్తులకు కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలి. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ప్రతి పేద విద్యార్థికి ఉన్నత చదువులను ఉచితంగా అందుబాటులోకి తెస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలాగా మార్చుతున్నారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి.

– ఓరుగంటి నాగేంద్రబాబు, పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్

నులిపురుగుల నివారణతోనే మెరుగైన ఆరోగ్యం

పిల్లల ఎదుగుదలకు అల్బెండజోల్ మాత్రలు



అల్బెండజోల్ మాత్రలను విద్యార్థికి మింగిస్తున్న డాక్టర్ శశిభూషన్



బద్వేలు అర్బన్ : నులిపురుగు నివారణ మందులు పంపిణీ చేస్తున్న కమిషనర్

ప్రొద్దుటూరు క్రైం : నులిపురుగుల నివారణతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యం. పిల్లలు మానసికంగా, శారీరకంగా ఎదిగేందుకు అల్బెండజోల్ మాత్రలు ఉపయోగపడతాయని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శశిభూషన్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా మంగళవారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల పిల్లల్లో నులిపురుగుల సమస్య ఉంటుందన్నారు. దీంతో ప్రభుత్వం ప్రతి యేటా రెండు సార్లు అల్బెండజోల్ మాత్రలను అంగన్‌వాడి కేంద్రాలు, పాఠశాలలు, కాలేజీలలో ఇస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు రక్తహీనత, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం, ఆకలి మందగించడం, బరువుతగ్గడం, పోషకాహారలోపం తదితర లక్షణాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ హిమబిందు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సీఓ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కామనూరు ప్రాథమిక ఆరోగ్యం పరిధిలో..

మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న అన్ని కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాల్లోని పిల్లలకు భోజనానంతరం 400 ఎంజీ మాత్రలను మింగించారు. మొదటి రోజు 96 శాతం మాత్రలను వేసినట్లు సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్ తెలిపారు. మిగిలిన వారికి ఈ నెల 25న అల్బెండజోల్ మాత్రలను వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, చంద్రకళ, సీహెచ్‌ఓలు, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీనివాసనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో..

శ్రీనివాసనగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఉన్న 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో వైద్యులు దినేష్‌బాబు, అనూష, హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సీఓ నాగజ్యోతి, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి

బద్వేలు అర్బన్ : ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఇందుకోసం రేపటి భావిభారత పౌరులైన చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, మండల విద్యాశాఖాధికారి ప్రమీల పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సురేంద్రనగర్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వి.సుబ్బారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్లు జనార్దన్‌రావు, శ్రీరాములయ్య, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలి

రాజుపాళెం : ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలని ఎంపీడీఓ షాకీర్ ఆలీఖాన్, హెచ్ఎం వెలంగికుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆల్‌బెండజోల్ మాత్రలను తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 రామస్వామిరెడ్డి, ఏఓ శివరామకృష్ణారెడ్డి, సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, సరస్వతి, ఏఎన్ఎం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

పోరుమామిళ్ల : విద్యార్థులు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని అడోల్సెంట్ హెల్త్ కౌన్సిలర్ అనిల్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో జాతీయ నులి పురుగుల దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు నులి పురుగుల గురించి వివరించారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఆరు బయట మల,మూత్ర విసర్జన చేయరాదన్నారు. ఇందువల్ల శరీరంలో హిమోగ్లోబిన్ లెవల్స్ తగ్గి రక్తహీనతకు గురవుతారన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

బి.కోడూరు : బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు మండల వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌ల ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, పీహెచ్ఎన్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రొద్దుటూరు : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్ తెలిపారు. మంగళవారం మాదక ద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా ప్రొద్దుటూరులో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆటోలకు పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పలితాలను ప్రజలకు స్వచ్ఛంద సంస్థల వారు అవగాహన కల్పించి వాటిని అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు కొండయ్య యాదవ్, వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు అరుణ్‌కుమార్‌రెడ్డి, బాలజీ, ఇంతియాజ్, నాగేంద్ర, శివాకుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు కాలనీ ఏర్పాటు చేయాలి

అట్లూరు : అర్హులైన ప్రతి దివ్యాంగుడికి ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు పక్కా గృహాలు మంజూరు చేయాలని దివ్యాంగుల ఇళ్ల స్థలాల సాధన సమితి గౌరవాధ్యక్షుడు పి.వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం బద్వేలులోని ఆర్డీఓ కార్యాలయంలో దివ్యాంగులతో కలిసి ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల ఇళ్ల స్థలాల సాధన సమితి అధ్యక్ష, కార్యదర్శులు రమణ, ఖదిరుల్లా, ఉపాధ్యక్షుడు ఖాదర్ బాషా, పెంచలయ్య, ఓబయ్య పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నివాళి



జెర్రి నడిపి ఓబయ్య చిత్రపటానికి పూలామల వేసి నివాళి అర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : దువ్వూరు మండల మాజీ ఎంపీపీ జెర్రి నడిపి ఓబయ్యయాదవ్ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, మాజీ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డితో కలసి మంగళవారం దువ్వూరులోని మాజీ ఎంపీపీ స్వగృహానికి వెళ్లారు. ఈ సందర్భంగా జెర్రి నడిపి ఓబయ్యయాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ ఎంపీపీ జెర్రి నడిపి ఓబయ్య నిరాడంబరుడని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబాన్ని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చిరాకి బాషా, మాజీ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, బి.మఠం జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోపిరెడ్డి బాబు, సర్పంచ్ చెంద్రాయుడు, ఎంపీటీసీ రఘు, మాజీ ఎంపీపీ విజయగోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్ ఓబుళకొండారెడ్డి, నాయకులు ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, బొంతపల్లె వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లేని సేవలే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ

మైదుకూరు : విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు లేని సేవలను అందించాలని ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ అన్నారు. మంగళవారం మైదుకూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, మైదుకూరు రూరల్ ప్రాంత మండల స్థాయి అధికారులు, సిబ్బందితో మైదుకూరు విద్యుత్ డివిజన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ వినియోగదారులకు వంద శాతం సేవలను అందించాలన్నారు. ఉద్యోగులకు కేటాయించిన ప్రాంతాల్లో నివాసం ఉంటే ఆశించిన మేర ఫలితాలు వస్తాయన్నారు. అధికారులు, సిబ్బంది సంబంధిత ప్రాంతాల్లో విధిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆకస్మిక తనిఖీలు చేస్తామని, కేటాయించిన ప్రాంతాల్లో నివాసం లేని వారిపై తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృథా కాకూడదన్నారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని ఆదేశించారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని తెలిపారు. విద్యుత్ బకాయిల వసూలుపై దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణి కృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులరెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్లు, జూనియర్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఏ ఫలితాలలో సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ

చాపాడు : జేఎన్‌టీయూఏ ఇటీవల విడుదల చేసిన ఇంజనీరింగ్ థర్డ్ ఇయర్ సెకండ్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ డా.శృతి తెలిపారు. ఈఈఈలో ఎస్.హరికృష్ణ 92.47%, సి.వేణుముని 89.50%, కె.మహాలక్ష్మి 89.24%, సీఎస్ఈలో బి.చైతన్య శ్రీ 84.30%, ఎస్.వెంకట అనిషారెడ్డి 84.19%, వై.జయవర్ధన్‌రెడ్డి 83.65%, ఈసీఈలో వి.గ్రీష్మ 82.47%, ఏ.నాగదీప్తి 81.82%, కె.వనజ 81.72%, మెకానికల్‌లో కె.కళ్యాణ్ బాషా 83.54%, సివిల్‌లో ఎస్.షాహీన్ 82.26%, బి.సాకేత్‌రెడ్డి 80.97%, ఎమ్.సమీర్ 80.64% మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఫలితాల పట్ల కరస్పాండెంటు డా.వి.జయచంద్రారెడ్డి, అకాడమిక్ డీన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

అట్లూరులో స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం

అట్లూరు : మండల కేంద్రమైన అట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాలకు సంబంధించిన 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా మండల విద్యాశాఖాధికారి ఖాదర్‌వల్లి, మండల పరిషత్ అధికారి సుజాతమ్మ హాజరయ్యారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో సాంకేతిక పరిజ్ఞానం, యోగా అంతర్గత శిక్షణ కార్యక్రమంతో పాటు ఖేలో ఇండియా అసెస్మెంట్ అంశాలు, వ్యాయామ ఉపాధ్యాయులకు వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్ క్రీడాపోటీలు నిర్వహించారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్‌రెడ్డి, బద్వేలు నియోజకవర్గ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కన్వీనర్ నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా, ఎంపీ మహేష్‌యాదవ్

చాపాడు : మైదుకూరు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని, ఇప్పటికే అభివృద్ధి పనుల కోసం రూ.17కోట్లతో ప్రతిపాదనలు పంపామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరమ్మతులు చేసిన వాటర్ ప్లాంట్‌ను మంగళవారం ఎమ్మెల్యే పుట్టా, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్‌లు ప్రారంభించారు. 2018–19లో అప్పటి రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్ నిధులతో ఏపీఎస్‌సీఆర్ఐసీ శాఖ ద్వారా రూ.5లక్షలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. ఇటీవల ఈ ప్లాంట్ మరమ్మతులకు గురైంది. అయ్యవారిపల్లె టీడీపీ నాయకులు మునిశేఖర్‌రెడ్డి వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి మంగళవారం ఎమ్మెల్యే, ఏలూరు ఎంపీల చేత ఘనంగా ప్రారంభింపజేశారు. ఈ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి ప్రోటోకాల్ శిలాఫలకం ఏర్పాటు చేసినప్పటికీ తమకు పిలుపు అందలేదని మండల, స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు. వాటర్ ప్లాంట్‌ను అధికారికంగా ప్రారంభించినప్పటికీ దీనిపై వివరాలు తమకు తెలియదని మండల అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెప్పటం గమనార్హం. గతంలో ఉన్న వాటర్ ప్లాంట్‌నే మళ్లీ ఎమ్మెల్యే చేత ప్రారంభింపజేశారని స్థానికులు చర్చించుకుంటున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, గురివిరెడ్డి, వేమారెడ్డి, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, నారపురెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంసాగర్ నుంచి నీటి విడుదల

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంసాగర్ రైతులకు అవసరమయ్యే విధంగా ఉండాలని ప్రాజెక్టులకు నీరు అందించేందుకు కాదని, వచ్చే ఏడాది బ్రహ్మంసాగర్ క్రింద ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మంగళవారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్‌తో కలసి ఎమ్మెల్యే పుట్టా బ్రహ్మంసాగర్ ఎడమ కాలువకు 400 క్యూసెక్కులు, కుడి కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుగంగ ఈఈ చంద్రశేఖర్, ఏఈ నాగేశ్వరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలకు సీట్లు కేటాయించాలని వినతి

ప్రొద్దుటూరు : మెడికల్ కాలేజీలకు కేటాయించిన సీట్లను నిర్వహించలేమని ఎన్ఎంసీ ప్రస్తుత ప్రభుత్వం లేఖ రాసిందని, వెంటనే ఆ మెడికల్ కాలేజీలకు సీట్లు కేటాయించాలని ప్రజాపక్షం నాయకులు మంగళవారం తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రజా పక్షం అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్యను అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీని మంజూరు చేసిందన్నారు. 2023–24లో ఐదు కాలేజీల్లో తరగతులు కూడా ప్రారంభమయ్యాయన్నారు. ఈ ఏడాది పులివెందుల, ఆదోని, మార్కాపురం, పాడేరు మెడికల్ కళాశాలలు ప్రారంభం కావాల్సి ఉందన్నారు. మెడికల్ కౌన్సిల్ సభ్యులు పరిశీలించి సీట్లను కూడా కేటాయించారన్నారు. ఆ సీట్లను రద్దు చేయాలని ప్రస్తుత ప్రభుత్వం కోరడం మెడికల్ విద్యను విద్యార్థులకు దూరం చేయడమే అన్నారు.

పరిసరాల శుభ్రతే మన లక్ష్యం



చాపాడు: మానవహారంగా ఉండి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



రాజీవ్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన మున్సిపల్ అధికారులు



బద్వేలు అర్బన్ : స్వచ్ఛతా హిసేవ ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, అధికారులు

ప్రొద్దుటూరు : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రాజీవ్ సర్కిల్ మానవ హారంగా ఏర్పాడ్డారు. ఈ సందర్భంగా అధికారులు ప్రతి ఒక్కరూ శుభ్రతను పాటించాలని, పరిశుభ్రతమే మన లక్ష్యమన్నారు. మనం రోజు నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వినియోగించడం వల్ల పర్యావరణం కాలుష్యం అవుతోందని, వాటిని వాడకుండా ప్రత్యామ్నాయంగా పేపర్, గుడ్డ సంచులను వినియోగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ సాయికృష్ణ, ఎంఈఓ సావిత్రమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయ కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, వెంకటనారాయణ, శివకరుణశ్రీ, వర్మ తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో మానవహారం

మైదుకూరు : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం మైదుకూరులో నాయకులు, అధికారులు మానవహారంగా ఏర్పడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి శ్రీకృష్ణదేవరాయల కూడలి, పొట్టి శ్రీరాములు సర్కిల్ మీదుగా పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించి శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ పాల్గొని స్వచ్ఛతా హీ సేవా గురించి వివరించారు. తహసీల్దార్ రాజసింహసరేంద్ర, ఎంపీడీఓ పి.లక్ష్మీదేవి, ఎంఈఓ–1 టీఎం పద్మలత, అర్బన్ సీఐ సయ్యద్ హాసం, ఐసీడీఎస్, మున్సిపల్, రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. అలానే మండలంలోని వనిపెంటలో ఎంపీడీఓ పి.లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వనిపెంట వీధుల్లో ర్యాలీ నిర్వాహించారు.

పశువైద్య కళాశాలలో ..

ప్రొద్దుటూరు : స్థానిక పశువైద్య కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా స్వచ్ఛభారత్ దివాస్‌ను చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సీఓలు ఇందిరా, జ్యోతి, పాండురంగారెడ్డి, వాణి పాల్గొన్నారు.

చాపాడు : వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు అన్నారు. మండల కేంద్రమైన చాపాడులో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ విద్యార్థులచే అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, సర్పంచ్ మహబూబ్ బీ, పంచాయతీ కార్యదర్శి ధనుంజయబాబు, టీడీపీ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

రాజుపాళెం : ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ షాకీర్‌ఆలీఖాన్ పేర్కొన్నారు. మంగళవారం రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా పరిశుభ్రత కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఓ శివరామకృష్ణారెడ్డి, ఎంఈఓ–2 రామస్వామిరెడ్డి, హౌసింగ్ ఏఈ శేఖర్‌రెడ్డి, హెచ్ఎం వేలంగి కుమార్, ఏపీఎం జయరాజ్, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం

బి.కోడూరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధులు దరిచేరవని సర్పంచ్ గోడి లక్ష్మిదేవి తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బి.కోడూరు పీహెచ్‌సీ ఆవరణలోని పిచ్చిమొక్కలను, తంగేడుపల్లె గ్రామంలోని అపరిశుభ్రత ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధులు దరి చేరవన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

బద్వేలు అర్బన్ : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా స్వభావ స్వచ్ఛత – సంస్కార్ స్వచ్ఛత ప్రచార కార్యక్రమాన్ని బద్వేలు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో నిర్వహించారు. ఇందులో భాగంగా నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి అనంతరం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 15 రోజుల పాటు జరిగే స్వచ్ఛతా హిసేవ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, వైవీయూ పాలక మండలి సభ్యులు కొండపల్లి చిన్నసుబ్బారావు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన : స్వచ్ఛతను మన జీవన విధానంగా మార్పు చేసుకొనేలా సమష్టిగా ముందడుగు వేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంఈఓ ప్రమీల తెలిపారు. మంగళవారం మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హి సేవ–2024 కార్యక్రమాలను చేపట్టారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక మండల స్థాయి అధికారిని నియమించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపవరం : స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ర్యాలీలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, డ్వాక్రా సంఘాలు, వైద్య సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. మన పరిసరాలను మనమే శుభ్రపరుచుకోవాలి అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఉదయభారతి, ఈఓపీఆర్‌డీ హసీనా, పంచాయతీ కార్యదర్శులు విజయకుమార్, శ్రీనివాసులరెడ్డి, వెంకటసుబ్బయ్య, మోష, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.